క్లుప్తంగా

తక్షణసాయం అందజేత



బాధితులకు నగదు అందజేస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన మండ్లి రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం నుంచి అందాల్సిన తక్షణ ఆర్థిక సాయం రూ.10 వేలను మృతుని భార్యకు వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచ్ ధనుంజయ్య అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలోనే లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పావనికుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, సచివాలయ సిబ్బంది మల్లికార్జున, వలంటీర్లు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యం అందలేదు'

శెట్టూరు: మండలంలోని ఎర్రబోరేపల్లిలో డీలర్ సక్రమంగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదంటూ లబ్ధిదారులు ఆందోళన చేశారు. సుమారు 20 మంది లబ్ధిదారులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. గత నెలలో సుమారు 20 కుటుంబాలకు రేషన్ ఇవ్వలేదన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి డీలర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో స్థానిక వీఆర్‌ఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

వీకేఎల్‌ఎల్-23 క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ శేఖర్

విడపనకల్లు: మండల కేంద్రంలో వీకేఎల్‌ఎల్-23 క్రికెట్ టోర్నమెంట్‌ను ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన జట్టు సభ్యులను పరిచయం చేసుకున్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు త్రినాథ్‌రెడ్డి, కురుబ గిరిబాబు తెలిపారు. విన్నర్ జట్టుకు రు.30 వేల నగదును త్రినాథ్ రెడ్డి, రన్నర్‌కు రూ.15వేలు అందజేస్తామని మేనేజిమెంట్ సభ్యులు తెలిపారు.

తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చండి

కణేకల్లు: కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ సూచించారు. మండలంలోని మాల్యం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సరస్వతీదేవికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హుసేన్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాహితి

ఉరవకొండ: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారిణి సాహితి సూచించారు. శనివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు దగ్గు, జలుబు ఇతరులకు వ్యాపించకుండా మాస్క్, చేతి రుమాలు వినియోగించాలన్నారు. వేడి నీళ్లు తాగడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పాఠశాలలో జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, మోతీలాల్‌నాయక్, హెల్త్ ప్రొవైడర్ సులోచన పాల్గొన్నారు.

వేళకు బడి బస్సులు నడపాలి

రాయదుర్గంటౌన్: వేళకు బడి బస్సులు నడపడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌నాయక్ అసహనం వ్యక్తం చేశారు. వేళకు బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్టీసీ డీఎం సురేష్‌కు విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న వేళ బడి బస్సులు సమయానికి రావడం లేదన్నారు. సాయంత్రం కూడా వేళకు బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అనిల్‌కుమార్, వీరేష్, నిఖిల్, రాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

- అధిక దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలిచిన రైతులు
- కిలో రూ.25తో విక్రయం

అరటి.. లాభాల మేటి!

గుమ్మఘట్ట: అరటిపంటను సాగు చేసి అన్నదాతలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. గత సీజన్‌లో అరటి పంటను సాగు చేసిన అన్నదాతలు అనేక నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది అరటి సాగు చేసిన అన్నదాతల ఇంట్లో సిరులు కురిపిస్తున్నాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా 820 మంది రైతులు 2,916 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది కిలో రూ. 9 – 12 రూపాయలకు విక్రయించగా ఈ సారి ఏకంగా కిలో రూ.25 పలికింది. మార్కెట్‌లో రెట్టింపు ధరలు పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ, ముంబయి, చెన్నై తదితర ప్రాంతాలకు అరటిని తరలిస్తూ అన్నదాతలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

మొక్కలను నాటే విధానం

హెక్టారు పొలంలో 3,100 మొక్కలను నాటుకోవచ్చు. మొక్కకు మొక్కకు మధ్య దూరం పది అడుగులు ఉండాలి. బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో టిష్యూకల్చర్ అరటిమొక్కలు దొరుకుతాయి. కంపెనీ రకాల బట్టి మొక్క ఖరీదు రూ.10 నుంచి రూ.15 వరకూ ఉంటుంది. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.70 వేలు పెట్టుబడి అవుతుంది. పంట కాలం 2 సంవత్సరాల రెండు నెలలు. ఈ కాల వ్యవధిలో మూడు సార్లు పంట కోతకు వస్తుంది.



రంగసముద్రంలో సాగు చేసిన అరటితోట



మార్కెట్‌కు తరలించేందుకు అరటికాయలను లారీలోకి లోడ్ చేస్తున్న కూలీలు

ధరలు కలిసివచ్చాయి



మూడు ఎకరాలలో అరటి పంట సాగుచేశా. సేద్యం, మొక్కలు, రసాయనిక, సేంద్రియ ఎరువులు , కూలీలకు రూ.2.50 లక్షలు పెట్టుబడుల రూపంలో ఖర్చు పెట్టాను. మొదటి పంట కోతకు వచ్చింది. 60 టన్నుల వరకూ దిగుబడివచ్చింది. కిలో రూ. 25లకు విక్రయించాం. గతంలో కిలో రూ.12కు విక్రయించాం. గతంలో పెట్టుబడులు మాత్రమే చేతికి వచ్చాయి. ఈ సారి మార్కెట్‌లో రెట్టింపు ధరలు లభించడంతో ఆదాయం వచ్చింది.

– వేమానందారెడ్డి, రైతు ఆర్.కొత్తపల్లి

ఐదు ఎకరాల్లో సాగు చేశా



బెంగళూరు ఉండి టిష్యూకల్చర్ మొక్కలను తీసుకువచ్చి ఐదు ఎకరాల్లో అరటి పంట సాగుచేశా. ఇప్పటికే మొదటి కోతలో 36 టన్నుల అరటిని విక్రయించాం. ఇంకా 75 టన్నుల అరటి ఉంది. గతంలో కన్నా ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కుటుంబసభ్యులు నిరంతరం శ్రమించడంతో ఆదాయం వచ్చింది. శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. ఉద్యాన అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు పంట యాజమాన్య చర్యలు చేపట్టాం.

– హరినాథరెడ్డి రైతు, రంగసముద్రం

అరటి సాగు ఉత్తమం



పండ్లతోటల పెంపకంలో అరటి పంటసాగు చాలా ఉత్తమం. రెండు సంవత్సరాల రెండు నెలల పంట కాలవ్యవధిలో మూడు సార్లు పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు మొదటి కోతలో 60 నుంచి 80 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. రెండో కోతలో 50 నుంచి 60 టన్నులు వస్తుంది. మూడో కోతలో 30 నుంచి 40 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ధరలు బహిరంగమార్కెట్‌లో అధికంగా పలకడంతో రైతులు సంతోషంగా ఉన్నారు.

– దస్తగిరి, ఉద్యానవన శాఖ అధికారి, రాయదుర్గం

'రెవెన్యూ అధికారులు అన్యాయం చేశారు'

కూడేరు: రెవెన్యూ అధికారులు తన భూసమస్యకు పరిష్కారం చూపకుండా అవతలి వ్యక్తులకు సహకారమిందిస్తూ అన్యాయం చేశారని కూడేరుకు చెందిన గోపీనాథ్ శనివారం విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశాడు. కమ్మూరు రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ 543-2లో 4-20 సెంట్ల ప్రభుత్వ భూమిని 2012లో తన పిన్నమ్మ ఉమాదేవి పేరిట రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్ పుస్తకం ఇచ్చి ఆన్‌లైన్‌లో భూవివరాలను పొందపరిచారన్నాడు. కాగా 2018లో అధికారులు తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి కురుగుంట సుబ్బమ్మ పేరిట పట్టా ఇచ్చి ఆన్‌లైన్‌లో ఎక్కించారని, వారు ఆ భూమిని వేరేవాళ్లకు విక్రయించారని వాపోయాడు. అనారోగ్య సమస్యలతో ఆలస్యంగా విషయం తెలుసుకుని రెవెన్యూ అధికారుల సూచన మేరకు ఆర్డీఓ కోర్టుకు అప్పీల్ చేసుకున్నానన్నాడు. ఆర్డీఓ మధుసూదన్ విచారణ జరిపి పీఓటీ యాక్ట్ ప్రకారం ఒకరికి ఇచ్చిన ప్రభుత్వ భూమి మరొకరికి అమ్మడానికి వీలులేదని, భూ వివరాలను హోల్డ్‌లో పెట్టాలని, ఈ ఏడాది జనవరి 30న ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కానీ ఇన్‌చార్జ్ తహసీల్దార్ మధుసూదన్ కొద్ది రోజులు హోల్డ్‌లో ఉంచి తర్వాత ఓపెన్ చేసి అవతలి వ్యక్తులకు పరోక్షంగా సహకారం అందించి అన్యాయం చేశారన్నారు. న్యాయం చేయాలని కోరితే ఆర్డీఓకు లెటర్ పెట్టా అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని, లేదంటే రెవెన్యూ కార్యాలయంలో ఆత్మహత్య చేసుకుంటానని అతడు ఆవేదన వ్యక్తం చేశాడు.



పట్టాదారు పాసుపుస్తకం, ఆర్డీఓ ఉత్తర్వుల కాపీ చూపుతున్న గోపీనాథ్

వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తి, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ పాలనలో రాయదుర్గం మున్సిపాలిటీలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగుల అండతో పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసి శనివారం నాటికి రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. రాయదుర్గం పురపాలకసంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెండేళ్లలో దాదాపు రూ.25 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషితో మరో రూ.20 కోట్ల ప్రత్యేక గ్రాంట్ మంజూరు దశలో ఉందన్నారు. నిధుల లభ్యతను బట్టి కాలనీల్లో దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తూ వారి గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 14 జగనన్న లేఅవుట్లలో 2,418 మందికి పట్టాలు అందించామన్నారు.



పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్

డిపాజిట్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: ఎస్‌బీఐ ప్రవేశపెట్టిన అత్యధిక వడ్డీ అందించే అమృత్ కలశ్, అమృత్ కలశ్ సర్వోత్తం పేరిట నూతన ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాయదుర్గం మెయిన్ బ్రాంచి చీఫ్ మేనేజర్ పీఎస్‌ఎల్‌ఎన్ ఫణికుమార్ సూచించారు. శనివారం ఆయన బ్రాంచి కార్యాలయంలో మాట్లాడారు. డిపాజిట్ పథకాల్లో చేరేందుకు మార్చి 31 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. 400 రోజుల కాల పరిమితితో 'అమృత్ కలశ్' డిపాజిట్ స్కీమ్ కింద సీనియర్ సిటిజన్స్‌కు(60 ఏళ్లు దాటిన వారికి) ఏటా 7.6 శాతం వడ్డీ, ఇతరులకు ఏడాదికి 7.1 శాతం ప్రకారం వడ్డీ లభిస్తుందన్నారు. అలాగే 2 ఏళ్ల కాల పరిమితి గల 'అమృత్ కలశ్ సర్వోత్తం' డిపాజిట్ పథకం కింద సీనియర్ సిటిజన్స్‌కు 7.90 శాతం వడ్డీ, ఇతరులకు 7.40 శాతం మేరకు వడ్డీ లభిస్తుందన్నారు. సర్వోత్తం డిపాజిట్‌కు కనీసం డిపాజిట్ రూ.15 లక్షలు పెట్టాల్సి ఉంటుందన్నారు. స్థానిక బ్రాంచిలలో ఇంటర్‌నెట్, యూనో యాప్ ద్వారా గాని డిపాజిట్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఎస్‌బీఐ బ్రాంచిని సంప్రదించాలని ఆయన కోరారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి



గోవిందవాడలో మిరప పంటను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్, ఉద్యానవనశాఖాధికారి దస్తగిరి



ఉద్దేహాళ్‌లో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాయదుర్గం: అకాల వర్షం కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో ఆయన అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో ఫోన్ కాన్ఫెరెన్స్ ద్వారా మాట్లాడారు.. వర్షం కారణంగా ఒక్క ఎకరం కూడా నష్టపోవడానికి వీల్లేదన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి నష్టంపై అంచనా వేయాలన్నారు. విత్తనం నుంచి విపత్తు దాక రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందనే విషయం గుర్తుచేసి ధైర్యం నింపాలన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి

బొమ్మనహాళ్: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని రాయదుర్గం వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బండూరు, దర్గాహొన్నూరు, గోవిందవాడ, సింగానహళ్లి, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో వ్యవసాయం సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. శుక్రవారం కురిసిన వర్షానికి 180 ఎకరాల్లో మిరప, 23 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామని ఆయన తెలిపారు. అలాగే శనివారం మండలంలోని గోవిందవాడ, దర్గాహొన్నూరు గ్రామాలలో కురిసిన వర్షానికి దెబ్బతిన్న మిరప, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. పరిహారం మంజూరుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని రైతులకు భరోసా కల్పించారు. మరో మూడు,నాలుగు రోజుల వర్షాలు కురిసే అవకాశాలున్నాయని కోత కోసిన పంటలను ఎత్తైన ప్రదేశాల్లో అరబెట్టుకోవాలని, నష్టపోకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పంటలు కుళ్లిపోకుండా బావిష్టన్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం ఉద్యానవనశాఖ అధికారి దస్తగిరి, ఆర్‌బీకే సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగిన తాగునీటి కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న కార్మికులు

కూడేరు: సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టుల్లో పని చేస్తున్న కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం శనివారం రెండో రోజు కూడా సమ్మె బాట పట్టారు. పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌ల వద్ద విడివిడిగా ఆయా ప్రాజెక్ట్ కార్మికులు ధర్నా చేపట్టారు. తాము మిషన్లు బంద్ చేసి సమ్మెలోకి రావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సుమారు 1800 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచి పోయిందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తేనే విధుల్లోకి చేరుతామని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు నాగరాజు, రాముడు, వన్నూరు స్వామి తిప్పయ్య, శ్రీనివాసులు, శ్రీరాములు, తిప్పేస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

న్యాక్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా న్యాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, జిల్లా అధికార ఆనంద్ రాజ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎలెక్ట్రికల్, అసిస్టెంట్ సర్వేయర్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి ఆపై చదివిన యువతీ యువకులు ఈనెల 30 లోపు న్యాక్ సెంటర్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 7019425587, 7013858450 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి గాయాలు

గుత్తి: కొత్తపేట బ్రిడ్జి సమీపంలో శనివారం బైక్ నుంచి కింద పడటంతో ఒకరికి గాయాలయ్యాయి. రాయలచెరువుకు చెందిన రామాంజనేయులు పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరారు. కొత్తపేట బ్రిడ్జి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కూడేరు: హౌసింగ్ డే సందర్భంగా శనివారం అధికారులు మండలంలోని జల్లిపల్లిలోని జగనన్న లే-అవుట్‌ను సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా లబ్ధిదారులతో మాట్లాడారు. పేదలకు సొంతికల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొందరగా నిర్మాణాలు చేపడితే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఇసుక, సిమెంట్‌ను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని హౌసింగ్ ఏఈ శేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివరంజని, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వలంటీర్లు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా

గాలివాన బీభత్సం



గడేకల్లులో వడగండ్ల కురిసిన దృశ్యం



బోరంపల్లిలో నేలవాలిన విద్యుత్ తీగలు



కళ్యాణదుర్గంలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని పెద్దముస్టూరు, మోపిడి, ఆమిద్యాల తదితర గ్రామాల్లో ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురిసింది. అరగంట పాటు ఈదురుగాలుల బీభత్సం సృష్టించడంతో పెద్దముస్టూరు, మోపిడి, అమిద్యాల గ్రామాల్లో వంద ఎకరాల్లో మామిడిపంటకు నష్టం వాటిల్లింది. మామిడి పిందెలు, కాయలు నేలపాలయ్యాయి. ఎకరాకు రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టానని, ఈదురుగాలులకు రూ.15 లక్షల వరకూ నష్ట పోయినట్లు బాధిత రైతు ఆదినారాయణ వాపోయాడు. అలాగే కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట మొత్తం తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు, డొనేకల్లు గ్రామాల్లో శనివారం వడగండ్ల వాన కురిసింది. దాదాపు గంటపాటు వడగండ్లతో వర్షం కురవడంతో పొలాలు,రోడ్లు జలమయమయ్యాయి. కాగా మిరప రైతులు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు.

కళ్యాణదుర్గం: మండలంలో శనివారం సాయంత్రం సుమారు అరగంట పాటు ఈదురు గాలులు, ఉరుములతో వర్షం కురిసింది.మండలంలోని బోరంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లపై చెట్లు పడ్డాయి. దీంతో విద్యుత్ వైర్లు నేలను తాకాయి. ఈ సమయంలో కరెంట్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అంజన్నకు అభిషేకం



బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం చేసి, మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల..విఠల రుక్మిణి పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున తులసి మాలధారణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు.

పోలీస్ స్టేషన్‌కు నూతన భవనాలు నిర్మించండి



హోం శాఖ మంత్రి వనితతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ పోలీస్ స్టేషన్‌తో పాటు పోలీసు సిబ్బంది ఉండేందుకు నిర్మించిన క్వాటర్స్ పూర్తి శిథిలావస్థకు చేరాయని, వాటికి నూతన భవనాలు నిర్మించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితను ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విజయవాడలోని హోం శాఖ మంత్రి చాంబర్‌లో కలిసి విన్నవించారు. ఈనెల 17న హోంశాఖ మంత్రితో ఎమ్మెల్సీ ఉరవకొండ నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ప్రధానంగా ఉరవకొండ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడం, స్టేషన్‌కు నూతన భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించేందుకు రూరల్, అర్బన్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన హోం మంత్రి వెంటనే జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి వివరాలు సేకరించి, పోలీసు స్టేషన్‌ల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయిస్తామని ఎమ్మెల్సీకి హామీ ఇచ్చారు.

పీఏసీఎస్ వద్ద పప్పుశనగ సేకరణ



పప్పుశనగ కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన పప్పుశనగ కొనుగోలు సేకరణ ఉరవకొండ పీఏసీఎస్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున కొనసాగుతోంది. శనివారం సేకరణ కార్యక్రమాన్ని పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శిలార్ మహ్మద్ గౌస్ పరిశీలించారు. ఈసందర్భంగా కార్యనిర్వహణ అధికారి మాట్లాడుతూ ఉరవకొండ పీఏసీఎస్ పరిధిలోని బూదగవి, వెలిగొండ, కొకుంట్ల గ్రామాల రైతుల నుంచి పప్పుశనగ సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే రాయంపల్లిలో ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి 50 క్వింటాళ్ల పప్పుశనగ సేకరించగా, ఉరవకొండలో ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రం నుండి 216 క్వింటాళ్లు సేకరించామన్నారు. రైతులు తప్పకుండా 14 శాతం తేమ, ఇతర వ్యర్థ పదార్థాలు 1 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం మాత్రమే ఉండేలా చూసుకోవాలన్నారు.